క్లుప్తంగా

25 నుంచి జగనన్న గృహ నిర్మాణాలు ప్రారంభం



చిప్పగిరిలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న థర్డ్ పార్టీ యాజమాన్యం

చిప్పగిరి: ఈ నెల 25 నుంచి చిప్పగిరిలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్లు థర్డ్ పార్టీ యాజమాన్య సభ్యులు తెలిపారు. సోమవారం వారు చిప్పగిరిలోని జగనన్న కాలనీని పరిశీలించారు. నిర్మాణాలలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. చిప్పగిరి అనంతరం నగరడోణ, రామదుర్గం, బెల్డోణ, ఏరూరు, కుందన గుర్తి తదితర గ్రామాలలో నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అబీర్ హుసేన్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



నాగదేవత, సుబ్రమణ్యేశ్వర విగ్రహాలు

ఆస్పరి:మండల కేంద్రమైన ఆస్పరిలో సోమేశ్వర స్వామి ఆలయంలో నాగదేవత, వినాయకుడు, పార్వతి, కలశం, సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో గంగ పూజ, హోమం, పూర్ణాహుతి, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు మల్లికార్జునరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, గోపాల్‌రెడ్డి, దత్తాత్రేయరెడ్డి, రామలింగారెడ్డి, రామిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నీలకంఠరెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర కోరారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.https:// apms. apcfss. in ht-pps:// cse. ap. gov. in వెబ్‌సైట్‌లో జూన్ 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 95022 46367 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులకు 11వేల మంది హాజరు

తుగ్గలి : మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో మంగళవారం 11వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరైనట్లు ఏపీఓ రామకృష్ణ తెలిపారు. డగ్‌అవుట్ ఫాంపాండ్‌లు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేపట్టామన్నారు. సకాలంలో వేతనాలు జమ అవుతుండడంతో కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి పనులకు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకున్న రైతులు అనుమతులు రాగానే పొలాల్లో గుంతలు తీసుకోవాలన్నారు. మూడేళ్ల పాటు పండ్ల మొక్కల సంరక్షణకు ప్రభుత్వమే చెల్లింపులు చేస్తుందన్నారు.

సదరం క్యాంపును సద్వినియోగం చేసుకోండి

ఆలూరు రూరల్: ఆలూరు సీహెచ్‌సీలో ప్రతి సోమవారం ప్రభుత్వ ఏర్పాటు చేసిన సదరం క్యాంపును దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు ఆర్థోపెడిక్ డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సదరం క్యాంపుకు వచ్చిన 15 మంది దివ్యాంగులకు పరీక్షలు చేసి వికలాంగుల సర్టిఫికెట్ కోసం సిఫారసు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సచివాలయాల ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న వికలాంగులకు గత మూడు నెలల నుంచి ఇప్పటి వరకు 180 మందికి పరీక్షలు చేసి సర్టిఫికెట్ల జారీ కోసం పర్సెంటేజ్ వేసినట్లు తెలిపారు.

రూ.5 లక్షలతో కల్వర్టు నిర్మాణం

మద్దికెర : మండల కేంద్రంలోని పెనుగొండ ఊరువాకిలి వద్ద ఉన్న రోడ్డుపై జెడ్పీ నిధులు రూ. 5 లక్షలతో కల్వర్టు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ సుహాసిని, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంజనేయులు సోమవారం తెలిపారు. ఎన్నో ఏళ్లగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతుండడంతో రోడ్డు వెడల్పుతో పాటు కల్వర్టు పనులు చేపట్టామన్నారు.

ఈసీగా పెంచలయ్య

తుగ్గలి : ఉపాధి హామీ పథకం మండల ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా పెంచలయ్య నియమితులయ్యారు. కొన్ని నెలలుగా చెన్నంపల్లి టెక్నికల్ అసిస్టెంట్ ప్రదీప్ ఇన్‌చార్జ్ ఈసీగా వ్యవహరిస్తున్నారు. ఆయన స్థానంలో డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న పెంచలయ్యను రెగ్యులర్ ఈసీగా నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 10 గంటలకు ఉప్పర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.

వైద్యుల గ్రామాల బాట

- వడదెబ్బ, సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు
- జాగ్రత్తలు పాటించాలంటూ విస్తృత ప్రచారం
- ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లు అందజేస్తున్న వైద్యసిబ్బంది



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మద్దికెర : అకాల వర్షాలు కురిసి ఆగిపోవడంతో వారం రోజులుగా రోజురోజుకు ఉష్ణోగ్రతల పెరిగిపోతున్నాయి. ఎండల వల్ల కలిగే సమస్యలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాటి ఎదుర్కొడానికి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే ఆరోగ్యశాఖాధికారుల ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది గ్రామాల బాట పట్టారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ఎండల్లో వడదెబ్బ, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు.

తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం

మే నెల మూడవ వారంలో కూడా ఎండలు మండుతున్నాయి. రానున్న రెండు రోజులు పాటు తీవ్రమైన ఎండలు, వడగాల్పులు వీచే అవకాశం వున్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వడదెబ్బ తగలడంతో పాటు సీజనల్ వ్యాధులు విజృభించే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వైద్య శాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి ప్రజలకు, రైతులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేస్తున్నారు. వేసవి ప్రతాపంతో డీహైడ్రేషన్‌కు గురయ్యే పరిస్థితుల్లో పనులు చేసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి జాగ్రత్తలు వివరిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్తారు.

వడదెబ్బకు గురైతే తీసుకోవలసిన చర్యలు

- ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థితికి వచ్చేవరకు చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరమంతా తుడవాలి. చల్లని గాలి తగిలే ఏర్పాటు చేయాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ, చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోస్, ఓరల్ డీహైడ్రేషన్ ద్రావణం పట్టించాలి.
- పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండా కాలంలో మరింత శ్రద్ధ తీసుకోవాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో వున్న రోగికి వెంటనే నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోనే ఆసుపత్రికి తరలించి వెంటనే వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

చేయకూడనివి..

తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండే సమయంలో ఎక్కువగా బయట తిరగకూడదు. రోడ్ల పక్కన విక్రయించే చల్లని రంగుల పానీయాలు, ఆహారం తినకూడదు. మాంసాహారం తగ్గించాలి. తాజా కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి, మద్యం సేవించరాదు.

చేయాల్సినవి

నీళ్లు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. నలుపు, మందంగా ఉన్న వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులను ధరించాలి. రోజుకు కనీసం 15 గ్లాసులు నీటిని తాగాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలి. ఎండవేళ ఇంటిపట్టునే వుండాలి బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి వాడాలి. ఇంట్లో కిటికీలు తెరిచివుంచుకోవాలి.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వేసవి కాలంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా వుండాలి. ఇష్టానుసారంగా ఎండలకు తిరిగితే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. ప్రయాణాలు ఎక్కువ దూరం చేయకుండా నీడ తగిలే చోటులో ఎక్కువ సమయం గడపాలి. శరీరం మగతగా ఉంటే వెంటనే వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి.

– నగేష్, ప్రభుత్వ వైద్యాధికారి, మద్దికెర.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

గోనెగండ్ల: పీఎం కిసాన్ డబ్బులు పడని రైతులు ఆర్‌బీకేల్లో ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి రాజా కిషోర్ సూచించారు. ఆర్‌బీకే పరిధిలో ఉన్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి సంబంధించి ఎన్‌పీసీఐ లింక్ కాని రైతులు సంబంధిత బ్యాంక్‌కు వెళ్లి లింక్ చేయించుకోవాలన్నారు. అలాగే పీఎం కిసాన్ నగదు పడని రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి ఆధార్‌కార్డులో తప్పుఒప్పులను సరిచేయించుకొని, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ నమోదు ఈనెల చివరి వరకు అవకాశం ఉందన్నారు.

నూతన విధానంతో విద్యా వ్యవస్థకు భంగం

గోనెగండ్ల: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన జాతీయ విద్యా విధానం వలన విద్యా వ్యవస్థకు భంగం కలుగుతుందే తప్ప లాభం చేకూరేలా లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ అన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు హాజరై ఆయన మాట్లాడారు. మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారే తప్ప ఏ ఒక్క రాజకీయ నాయకుడికి కూడా ప్రజలకు మేలు చేసే చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాఠ్యపుస్తకాల్లో చరిత్ర కారుల పాఠ్య అంశాలను తొలగించడం చూస్తుంటే మనం చాలా సంవత్సరాలు వెనక్కి పోతున్నట్లు అనిపిస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సామాజిక స్పృహ కలిగి నిబద్ధతతో మెరుగైన సమాజం కోసం పాటు పడాలన్నారు. ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, నాయకులు రంగప్ప, అబ్దుల్లా, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరులో ఉరుములు మెరుపుల వర్షం

- నెలకొరిగిన చెట్లు
- విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు
- నిలిచిన విద్యుత్ సరఫరా



కోయనగర్ కాలనీలోని ట్యాంక్ వద్ద కూలిన విద్యుత్ స్తంభం



పీర్ల చావిడి వద్ద విద్యుత్ తీగలపై విరిగిపడ్డ చెట్టు

ఆలూరురూరల్: ఆలూరులో సోమవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్‌తీగలు తెగిపోవడంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కోయనగర్‌లోని పీర్ల చావిడి, తాగు నీటి ట్యాంకు వద్ద రెండు విద్యుత్ స్తంభాలతో పాటు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో స్తంభాలు పడిపోయాయి. ఈదురుగాలలకు చెట్లు నేలకూలాయి. మొలగవల్లి గ్రామంలో రెండు విద్యుత్ స్తంభాలు, హత్తిబెళగల్ గ్రామంలో మూడు స్తంభాలు విరిగిపోయినట్లు విద్యుత్ ఏఈ లోకేష్ తెలిపారు. అలాగే హాలహర్వి మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండ వేడిమి వల్ల ఉక్కపోతలతో అల్లాడిన జనం సోమవారం కురిసిన వర్షానికి ఉపశమనం పొందారు.

ఎమ్మార్సీ చేరిన పాఠ్య పుస్తకాలు

కృష్ణగిరి: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో విడత పాఠ్యపుస్తకాలు ఎమ్మార్సీకి చేరాయని ఎంఈఓ విజయభాస్కర్ సోమవారం తెలిపారు. మండలానికి మొదటి విడత కింద ఇదివరకే 21,600 పుస్తకాలు రాగా, ఇప్పుడు రెండో విడత కింద 12,249 పుస్తకాలు వచ్చాయన్నారు. ఇంకా దాదాపుగా 10వేల పుస్తకాలు రావాల్సి ఉందని ఆయన తెలియజేశారు.

నమోదు చేసుకున్న ప్రతి రైతుకు విత్తనాలు

కృష్ణగిరి: ఆర్‌బీకేల్లో విత్తనాల కోసం నమోదు చేసుకున్న రైతులందరికీ వేరుశనగ, కంది, కొర్ర విత్తనాలు అందజేస్తామని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కృష్ణగిరిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. రెండు రోజుల్లో విత్తనాలు ఆర్‌బీకేలకు చేరుతుందన్నారు. వచ్చిన వెంటనే ఆయా గ్రామాల్లోనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు రైతు వాటా చెల్లించి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు వలంటీర్లకు సన్మానం

కృష్ణగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వలంటీర్లకు సేవా పురస్కారాలను ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా అందిస్తున్నట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్ సోమవారం తెలిపారు. మండల పరిధిలోని 14 గ్రామ పరిధిలోని వలంటీర్లకు సేవా పురస్కారాలు అందించడం జరుగుతుందని, అందరూ హాజరుకావాలన్నారు.

శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలోని శ్మశాన వాటిక చిన్నగా ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, దీంతో స్మశాన విస్తీర్ణాన్ని పెంచాలని సీపీఐ గ్రామ నాయకులు ఎల్లప్ప, చిలిపికృష్ణ తదితరులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు దశరథుడు, కోదండరాముడు, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

30న సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని బజార్ హమాలి యూనియన్ సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 30 నిర్వహించే సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవానికి సభ్యులందరు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నగేష్, మండల ఉపాధ్యక్షులు మారెన్న, పెద్ద ఏసు, వెంకటేష్ పాల్గొన్నారు.

పేదల బతుకుల్లో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- హోసూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



హోసూరులో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్ : పేదప్రజల బతుకుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ కాంతులు నింపుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని హోసూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో లబ్ధి పొందిన పథకాలను గురించి వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు సీసీరోడ్లు, డ్రైనేజీ లేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే సీసీరోడ్లు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మరికొందరు తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకునిరాగా సాంకేతిక కారణాలతో అర్హులైన వారికి పథకాలు అందకపోతే అలాంటివాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె మాట్లాడుతూ ఎలాంటి వివక్షకు తావులేకుండా పారదర్శకంగా పథకాలను అమలుచేయడంలో సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఎవరూ సాటిలేరన్నారు. ఎవరిప్రమేయం లేకుండా నేరుగా అర్హుల ఖాతాకే సొమ్ము జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాస్, హోసూరు సర్పంచు నాగప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారంనాగరాజు, శ్రీనివాసులు, మోహన్, ఎంపీటీసీలు కేశప్ప, నెట్టేకల్, శాంతిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మద్దికెర: మండలంలోని మద్దికెర, బసినేపల్లి గ్రామాలలో నాటుసారా తరలిస్తున్న వెంకటేశులు, రవిలను అరెస్టు చేసి వారివద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ సోమవారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు వెల్లడించారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఎక్కడైనా పేకాట, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 91211 01130 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రవీంద్రనాథ్ సూచించారు. సోమవారం ఆయన ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాలలో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే 6 వేల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారన్నారు. అలాగే సకాలంలో వేతనాలు కూడా చెల్లించడం జరిగిందన్నారు.

పత్తికొండ డీఎల్‌పీవోగా ప్రకాష్‌నాయుడు



పత్తికొండ టౌన్: పత్తికొండ డివిజనల్ పంచాయతీ అధికారిగా ఎం ప్రకాష్ నాయుడు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎల్‌పీవో శ్రీకాంత్ చౌదరి అనారోగ్య కారణాలతో సెలవులో వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో ఆలూరులో పనిచేస్తున్న ప్రకాష్‌నాయుడును నియమించారు. ఈమేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

సింహగర్జనకు తరలిరావాలి

ఆస్పరి:ఈనెల 31న ఆలూరులో నిర్వహించే మాలల సింహ గర్జనకు తరలి రావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని కై రుప్పల, కారుమంచి గ్రామాలలో మాల మహానాడు కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం మాలలు ఐక్యమత్యంతో పోరాటం చేయాలన్నారు. నాయకులు సోమశేఖర్, ఈరన్న, రామాంజిని, విరుపాక్షి, నాగేంద్ర పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్ : దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సంస్థ కార్యాలయంలో కృష్ణగిరి, వెల్దుర్తి, మద్దికెర మండలాల దివ్యాంగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వికలాంగుల సంఘం జిల్లా నాయకుడు దేవేంద్ర మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పింఛన్ పెంపుతో తమకు న్యాయం జరిగిందన్నారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా తమకు న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. పి.మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామన్నారు. అంతేకాకుండా తమసంస్థ తరఫున ఉపాధి అవకాశాలు కలిప్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు కోటేశ్వరరావు, సేవాదళ్ ప్రతినిధులు గోవిందు, చక్రాళ్ల కాంతిరెడ్డి, బారికి బస్సన్న తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



108లో జన్మించిన ఆడబిడ్డను చూపుతున్న ఈఎంటీ

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్య సోమవారం తెల్లవారుజామున 108 అంబులెన్స్‌లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కారుమంచి గ్రామానికి చెందిన సంధ్యకు నాల్గవ కాన్పు పురిటి నొప్పులు రావడంతో ఆశా కార్యకర్త పద్మావతి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చింది. వెంటనే కారుమంచి చేరకున్న అంబులెన్స్ డ్రైవర్ మల్లికార్జున, ఈఎంటీ వీరేష్ గర్భిణిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండగా, వారిని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు.

రస్తా సమస్య పరిష్కరించాలి

హొళగుంద: గ్రామంలోని ఎస్సీ కాలనీలో రస్తా విషయం పై ఎమ్మార్పీఎస్ నాయకులు, కొందరు ఎస్సీ కాలనీ వాసులు సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పంచగుండిగ వెంకటేష్, దుర్గాప్రసాద్, వీరేశ్, కాలనీకి చెందిన మహిళలు తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌తో వాగ్వాదానికి దిగారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు కార్యాలయానికి చేరుకుని తహసీల్దారు, ఆందోళన కారులతో చర్చించారు. అలాగే సర్వేయర్‌తో కొలతలు వేయించి రస్తా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

తవ్విన రోడ్డును నిర్మించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 9వ వార్డులోని చంద్రయ్య కొట్టాల ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికై తవ్వి వదిలేసిన ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు సత్వరం ప్రారంభించాలని సీపీఐ నాయకులు పంపన్నగౌడ్, రంగన్న డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

స్పందనకు అధికారులు గైర్హాజరు

చిప్పగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందనలో భాగంగా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రూరల్ డెవలప్‌మెంట్, తదితర శాఖల అధికారులు గైర్హాజరు అయ్యారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలు చేసేదేమి లేక వెనుతిరిగి వెళ్లారు.

వేరుశనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రారంభం

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద అందించే వేరుశనగ విత్తనాల కోసం రైతులు ఆర్బీకే కేంద్రాల్లో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆలూరు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రాయితీ కింద కే–6 రకం విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. క్వింటా వేరుశనగ ధర రూ.9,300 కాగా ప్రభుత్వం 40 శాతం రాయితీతో రూ.5,580లకు అందిస్తోందన్నారు. ఒక ఎకరా అంతకంటే ఎక్కువ పొలం ఉన్న రైతుకు మూడు ప్యాకెట్ల విత్తనాలు ఇస్తారన్నారు. ఒక ప్యాకెట్ ధర రూ.1,674. ఆలూరు మండలానికి 520 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించినట్లు చెప్పారు. రైతు ముందుగా నగదు చెల్లించి ఆర్బీకేలో కియోస్క్ మిషన్ ద్వారా ఆర్డర్ చేసుకుంటే మూడు రోజుల్లో వారికి విత్తనాలు అందిస్తామన్నారు.

వేరుశనగ కోసం పేర్ల నమోదు

తుగ్గలి : ఖరీఫ్ సీజన్‌లో మండలానికి 2,600 క్వింటాళ్ల వేరుశనగ, 30 క్వింటాళ్ల కందులు కేటాయించారు. 40శాతం సబ్సిడీతో ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందిస్తోంది.

విత్తననమోదు ప్రక్రియ ప్రారంభం

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వేరుశనగ పంటకు విత్తన నమోదు ప్రక్రియను ఏఓ హేమలత సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఈనెల 25 నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం

ఆలూరు రూరల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం జూనియర్ ఇంటర్, సాయంత్రం సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఆలూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 11 రూములను సిద్ధం చేశారు. ఆలూరు మండలంలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 1,302 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 1,138 మంది మొత్తం 2,440 మంది హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఒక ఛీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, 10 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ చేసేలా ప్రణాళిక రూపొందించారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలో అనుమతి లేదు.

నిఘా నీడలో పరీక్షలు

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు నిఘా నీడలో నిర్వహిస్తాం. పరీక్ష కేంద్రంలో అన్ని గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఇన్విజిలేటర్లకు సెల్‌ఫోన్ అనుమతి లేదు. విద్యార్థులు అర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.

– శంకర్ ప్రసాద్, ఆలూరు జూనియర్ కాలేజీ చీఫ్

వలంటీర్ల సేవలకు తగిన గౌరవం



హొళగుందలో సేవామిత్ర అవార్డు గ్రహీతలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు



ఆలూరులో సేవా వజ్ర అవార్డులు అందుకున్న వలంటీర్లతో నారాయణస్వామి

హొళగుంద: గ్రామాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తగిన గౌరవం ఇచ్చి సత్కరించడం హర్షించదగ్గ విషయమని పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ అన్నారు. సోమవారం హొళగుంద గ్రామ సచివాలయంలో సేవామిత్ర అవార్డులు పొందిన వలంటీర్లకు సర్పంచ్ చలువాది రంగమ్మ, వైస్ సర్పంచ్ మీనాక్షి ఆధ్వర్యంలో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు పంపాపతి, హనుమప్ప, సోమిరెడ్డి, ఫజుల్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రంగమ్మ ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి వలంటీర్లకు అవార్డులు అందజేసి సత్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, వైస్ ఎంపీపీ శ్రీరాములు, నాగవేణి, మండల కన్వీనర్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.